హైదరాబాద్ వార్త



# లక్డికాపూల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

* కబాబ్‌తోపాటు నాన్ వెజ్ ఐటమ్స్‌లో సింథటిక్ ఫుడ్ కలర్స్
* మిగిలిపోయిన ఫుడ్‌ను ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేసి నెక్స్ట్ డే సర్వ్
* షాహీ దస్తర్ ఖాన్, బడే మియా కబాబ్స్, ఖాన్ రెస్టారెంట్ల తనిఖీలు



**హైదరాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త**

నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అధికారులు.. ఆహార భద్రతా జాగ్రత్తలు పాటించని పలు హోటళ్ల లైసెన్సులను రద్దు చేశారు. తాజాగా లక్డికాపూల్లోని పలు రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. షాహి దస్తర్‌ఖాన్, బడేమియా కబాబ్స్, ఖాన్ ఈ ఖాస్ రెస్టారెంట్లు ఆహార భద్రతా నియమాలను పాటించడంలేదని అధికారులు గుర్తించారు. దీంతో పాటు కబాబ్స్‌తోపాటు నాన్వెజ్ ఐటమ్స్ సింథటిక్ ఫుడ్ కలర్స్ కలుపుతున్నారు. హోటళ్ల యజమానులు కస్టమర్ల జీవితాలతో ఆడుకుంటున్నారు. వంట గది పరిశుభ్రతపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆ ప్రదేశంలో బొద్దింకలు, ఎలుకలు సంచరిస్తున్నట్లు గుర్తించారు. గడువు ముగిసిన ముడిసరుకుతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారు. కాలం చెల్లిన మామిఎక్స్పైర్ అయిన మ్యాంగో మిల్క్, కోకోనట్ మిల్క్, కొరియా వాటర్ వాడుతున్నారు. మిగిలిపోయిన ఆహారాన్ని ఫ్రిజ్లో భద్రపరిచి మరుసటి రోజు అందించినట్లు అధికారులు తెలిపారు. స్టోర్ రూంలో ఫంగల్ అల్లం కనిపించింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాల్లో ఎక్కువ ఫుడ్ కలర్స్ వాడినందుకు హోటల్, రెస్టారెంట్ మేనేజర్లకు నోటీసులు జారీ చేశారు. ఆహార భద్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోకుంటే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

### బంజారాహిల్స్‌లో బిర్యానీలో బొద్దింక.. తూతూమంత్రపు దాడులు

**పంజగుట్ట, నవంబరు 28 (ప్రభాతవార్త):**

ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఎన్ని దాడులు జరుపుతున్నా హోటళ్ల యాజమాన్యాలలో మార్పు రావడం లేదు. ముఖ్యంగా కిచెన్‌లో అపరిశుభ్ర వాతావరణంతో వినియోగదారుల ఆరోగ్యాలతో చలగాట మాడుతునానరు. ప్రతిరోజూ ఏదో ఒక హోటల్‌లో బొద్దింకలు రావడం నగరంలో షరా మామూలుగా మారిపోయింది. నిన్న సికింద్రాబాద్ లో పేరుమోసిన హోటల్‌లో బిర్యానిలో బొద్దింక రావడం వినియోగదారులు ఆందోళన చేసిన విషయం విదితమే. తాజాగా బంజారాహిల్స్‌లో ఇదే సంఘటన పునరావృతమైంది. బంజారాహిల్స్ రోడ్డునంబర్ 3లోని బిర్యానీవాలా హోటల్‌లో తింటున్న బిర్యానీలో బొద్దింక ప్రత్యక్షమైంది. బొద్దింక రావడంతో కస్టమర్లు ఆందోళనకు దిగారు. యాజమాన్యం కస్టమర్‌లతో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం జరిగింది. బొద్దింక వస్తే మేం ఏం చేస్తాం అంటూ సమాధానం చెప్పడంతో పాటు ఇది మామూలు విషయంగా వారు మాట్లాడారు. కొందరు కస్టమర్‌లు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ చేసినా సంబంధిత అధికారులు ఎవరూ అటువైపు కన్నెత్తిచూడలేదు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు అడపా దడపా దాడులు చేయడం వారిపై చిన్న చిన్న కేసులు ఎపెట్టి వదిలేయడంతో హోటళ్ల యజమానులు కూడా పరిశుభ్రత విషయంలో శ్రద్ధ తీసుకోకుండా కేవలం లాభార్జనే ధ్యేయంగా హోటళ్లను నడుపుతున్నారని పలువురు కస్టమర్‌లు వాపోయారు..

# బల్దియా బడ్జెట్ రూ. 8500 కోట్లు

**30న స్టాండింగ్ కమిటీ ముందుకు ప్రతిపాదనలు**



**హైదరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక బడ్జెట్‌ను రూ.8,500 కోట్లతో ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందుకు సంబంధించి ఈ నెల 30న స్టాండింగ్ కమిటీ ముందుకు బడ్జెట్ ప్రతిపాదనలు రానున్నాయి. బల్దియా 2024-25 బడ్జెట్ రూ.7,937 కోట్లు కాగా, వచ్చే ఏడాదికి సంబంధించి మరో రూ.500 కోట్లు పెంచే అవకాశం కనిపిస్తున్నది. వాస్తవానికి అక్టోబర్‌లోనే బడ్జెట్‌కి సంబంధించిన ప్రక్రియ మొదలుపెట్టాల్సి ఉంటుంది. స్టాండింగ్ కమిటీ ఆమోదించి నవంబర్ 15వ తేదీలోగా కౌన్సిల్ ముందుంచాలి. వచ్చే ఏడాది జనవరి 10 లోగా జనరలాబాడీ మీటింగ్ పెట్టి సమీక్షించి ఫిబ్రవరి 20లోపు ఆమోదించాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల తర్వాత ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాలి. మార్చి7లోపు ఆమోదం కోసం ప్రభుత్వానికి సమర్పించాలి. అయితే ఈ నెల10వ తేదీతో గడువు ముగిసి 15 రోజులైనా బల్దియా అధికారులు ఇంకా అంచనాలు ఖరారు చేసే పనిలోనే ఉన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న కౌన్సిల్ ఐదోబడ్జెన్‌కు ఆమోదం తెలపనున్నది. గ్రేటర్‌లో ఎన్నికలు జరిగి నాలుగేండ్లు మాత్రమే అయినప్పటికీ ఈ పాలకమండలికి ఐదు సార్లు బడ్జెట్‌కు ఆమోదం తెలిపే అవకాశం లభించింది. 2020 నవంబర్ లోనే గ్రేటర్ ఎన్నికలు జరిగినప్పటికీ.. అంతకుముందు పాలకమండలికి గడువు ఉండడంతో ఫిబ్రవరి 10వ తేదీ వరకు కొనసాగింది. 2021-22 బడ్జెట్ కి సంబంధించి స్టాండింగ్ కమిటీ అప్రూవల్ వచ్చినప్పటికీ కౌన్సిల్ ఆమోదించకుండానే పాలకమండలి గడువు ముగిసింది. 2021 జనవరిలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించాలని అనుకున్నప్పటికీ కరోనా కారణంగా సమావేశం నిర్వహించలేదు. తర్వాత ఫిబ్రవరి 11న ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న పాలకమండలి అదే ఏడాది జూన్ 26న వర్చువల్ మీటింగ్ ద్వారా బడ్జెట్ ను ఆమోదించింది. 2020 మాదిరిగా గ్రేటర్ ఎన్నికలను వచ్చే ఏడాది నవంబర్ లో నిర్వహిస్తే ప్రస్తుత పాలకమండలికి ఇదే చివర బడ్జెట్ అవుతుంది.

**మార్పులు చేర్పులకు సమయం..**

బడ్జెట్‌పై మార్పులు, చేర్పులు, అనంతరం స్టాండింగ్ కమిటీ ఆమోదానికి కనీసం 20 రోజుల సమయం తీసుకోనుంది. కనీసం 15 రోజుల ముందు కార్పొరేటర్ సభ్యులకు బడ్జెట్ ప్రతిపాదనలను అందజేయాల్సి ఉంటుంది. జనరల్ బాడి సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం, సభ్యుల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుని మళ్లీ అవసరమైన మార్పులు, చేర్పుల అనంతరం బడ్జెట్ అనుమతికి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. 2021-22లో బడ్జెట్ అంచనాలు రూ.5600 కోట్లు, 2022-23లో బడ్జెట్ అంచనాలు రూ. 6,150 కోట్లు, 2023-24లో బడ్జెట్ అంచనాలు రూ. 6,224 కోట్లు, 2024-25లో రూ. 7,937 కోట్లు అంచనాతో బడ్జెట్ రూపొందించింది. అయితే 2025-26 వార్షిక బడ్జెట్ అంచనాలు దాదాపు రూ. 8500 కోట్ల వరకు ఉండే అవకాశాలు కనబడుతున్నాయని చర్చ జరుగుతున్నది.

**సొంత ఆదాయంపైనే దృష్టి...**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లపైనా జీహెచ్ఎంసి పెద్దగా ఆశలు పెట్టుకోవడంలేదు. సంస్థకు చెందిన ప్రధాన ఆదాయ వనరులపైనే ప్రత్యేక ఫోకస్ పెడుతుంది. ఇప్పటికే ఈ సంవత్సరానికే సుమారు రూ. 3,759.46 కోట్లు ప్రభుత్వం నుంచి జీహెచ్ఎంసికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఏలాంటి నిధులు మంజూరు చేయలేదని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో హెచ్ సిటీలో భాగంగా రూ. 2664 కోట్లు కేటాయించినా ఇప్పటివరకు రెండు క్వార్టర్లకుగానూ రూ. 1333 కోట్లు మంజూరు చేయాల్సిన ప్రభుత్వం కేవలం కెబిఆర్ పార్కు వద్ద ప్రతిపాదించిన ఫ్లైఓవర్లకు రూ.821 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. రావాల్సిన బకాయిలకు మొండిచేయి చూపించి, కేటాయింపుల్లోనూ కోతలు విధిస్తున్న ప్రభుత్వంపైన ఆశలు పెట్టుకో కుండానే వార్షిక బడ్జెట్ అంచనాలపై జీహెచ్ఎంసి ఫోకనెపెట్టింది. ముఖ్యంగా ఆస్తిపన్నుపైనే సుమారు రూ.2450 కోట్ల వరకు, ప్లానింగ్ విభాగం నుంచి రూ.2100 కోట్లు, ట్రేడ్ లైసెన్స్ నుంచి 200కోట్లు , అడ్వర్టైజ్‌మెంట్ నుంచి 35కోట్లు, కాంపన్సేషన్ ద్వారా 1500కోట్లు వరకు రావచ్చుననే అంచనాలను అధికారులు వేస్తున్నట్లు తెలుస్తుంది.

# ఎన్జీవోస్,శిశు విహార్‌లలోని పిల్లలకు అన్ని సర్టిఫికెట్లు ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**హైదరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త:**

జిల్లాలోని వివిధఎన్జీవోస్, శిశువిహార్ సంరక్షణ కేంద్రాలలోని పిల్లలకు బర్త్, క్యాస్ట్, ఆర్ఫన్, ఆధార్, ఆధార్ అప్డేషన్ ధ్రువీకరణ పత్రాలను వారం రోజుల్లోగా జారీ చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్, జిహెచ్ఎంసి సీఎంఓ, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్,డిసిపిఓ, స్వచ్ఛంద సంస్థలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, శిశువిహార్ సంరక్షణ కేంద్రంలోని 1500 పిల్లల బర్త్, క్యాస్ట్, ఇన్ కం, ఆధార్ కార్డ్, ఆధార్ కార్డు అప్డేట్ ఇతర ధ్రువీకరణ పత్రాల జారీ కోసం 7ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి వారం రోజుల్లేగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్యాంపు సందర్భంగా పిల్లలకు భోజనం, నీరు, వైద్య అవసరాలను కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి, డిఆర్ఓ ఈ వెంకటాచారి, జిహెచ్ఎంసి సీఎంఓ డాక్టర్ పద్మజ, డిడబ్ల్యుఓ అక్కేశ్వరరావు, డీసీపీఓ శ్రీనివాస్, ఇంచార్జ్ డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజేంద్రనాథ్, ఆర్డీఓ సాయిరాం, ఎస్ఇఎం జ్యోతి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, ఎన్జీవోలు బాలసదనముల అధ్యక్షులు, ఆధార్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీసులో సినీహీరో నాగార్జున సందడి

**పంజగుట్ట, నవంబరు28 (ప్రభాతవార్త):**

ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయానికి సినీహీరో అక్కినేని నాగార్జున వ్యక్తిగత పనిమీద గురువారం విచ్చేశారు. నాగార్జున రాకను తెలుసుకున్న అభిమానులు అక్కడకు పెద్దఎత్తున చేరుకుని సెల్ఫీల కోసం ఎగబడ్డారు. కొత్తకారు టయోటా లెక్సస్ వాహనం రిజిస్ట్రేషన్‌కోసం రవాణాశాఖ కార్యాలయం ఫొటో దిగారు. ఆఫీసుకు వచ్చిన వారితో పాటు బయట నుంచి పెద్దఎత్తున తరలిరావడంతో అక్కడ కొంతసేపు విపరీతమైన రద్దీ ఏర్పడింది.

## విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**ముషీరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో కలుషిత ఆహారం కారణంగా సంభవించిన విద్యార్థుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా ఆరోపించారు. గురువారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కలుషితమై విద్యార్థులు అనారోగ్య బారిన పడటం కాంగ్రెస్ పాలనలో ఎక్కువయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రాణాలు పోతున్నా, హైకోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వంలో చలనం లేదని ధ్వజమెత్తారు. మగునూరు ఘటనలో శైలజ అనే గిరిజన అమ్మాయి చనిపోతే మంత్రులు ఎవరూ పరామర్శించలేదు సరికదా సీతక్క ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు ఎంతసేపూ తమ పదవులు కాపాడుకోవాలనే ఆరాటం తప్ప ప్రజల సంక్షేమం పట్టటం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబా

# తప్పక చదవాల్సిన పుస్తకాలు 'కుదురు, బహుళ'

**బిసి కమిషన్ తెలంగాణ రాష్ట్ర మాజీ ఛైర్మన్ బి.ఎస్.రాములు**



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న

**రవీంద్రభారతి, నవంబరు 28 ప్రభాతవార్త :**

ప్రముఖకవి, రచయిత్రి జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన బహుళ మూడవ వార్షిక సంచిక, ప్రముఖకవి, రచయిత్రి, ఉపాధ్యాయిని నాంపల్లి సుజాత రచించిన కుదురు వ్యాస సంపుటికిలు ప్రతీఒక్కరూ తప్పక చదవాల్సినవేనని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్, రచయిత, తత్వవేత్త బి.ఎస్.రాములు అన్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సాహిత్య అకాడమీ, బహుళ త్రైమాసిక పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో రచయిత్రి డా. తిరునగరి దేవకీదేవి సభాధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బి.ఎస్. రాములు ప్రముఖ కవులు, సాహితీవేత్తలు, రచయితలు డా. నామోజు బాలాచారి, డా. గోగు శ్యామల, యాకూబ్, డా. నాళేశ్వరం శంకరం, కొండవీటి సత్యవతి, మెహజబిన్, విమలక్క, మానస, డా.గీతాంజలి, సిహెచ్.ఉషారాణి, దేవేంద్ర తదితరులతో కలిపి బహుళ సంచిక, కుదురు వ్యాససంపుటిలను ఆవిష్కరించి ప్రసంగించారు. చివరిగా రచయిత్రిలు జ్వలిత, సుజాతలను అతిథులు ఘనంగా సత్కరించి అభినందించారు.

# దుర్గంధం వెదజల్లుతున్న 'చింతలకుంట'

**చెత్త, వ్యర్థాల పారబోత.. మురుగు నీరు నేరుగా చెరువులోకే.. స్పందించని అధికారులు..మనుగడ ప్రశ్నార్థకంగా మారిన వైనం**

**దుండిగల్, నవంబరు 28 ప్రభాతవార్త:**

ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం..నిర్లక్ష్యం కారణంగా ఓ చెరువు ఉనికిని కోల్పోయే స్థితికి చేరుకుంది. నాలుగైదు ఏళ్లకింద వరకు స్థానిక మత్స్యకార కుటుంబాలకు బాసటగా నిలిచిన చెరువు నేడు దుర్గంధభరితంగా మారింది. ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో రోజు చెత్త, వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. పరిసర కాలనీల మురుగునీరు నిత్యం చెరువులోకి ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో మురుగు పేరుకుపోయి కాలుష్య కాసారంగా మారి కంపుకొడుతుంది. చెరువు కట్ట వద్ద చదును చేసి బిల్డింగ్ మెటీరియల్ డంప్ చేసి వ్యాపారాలు చేస్తున్నారు. నలువైపుల నుండి చెరువుకు ముప్పువాటిల్లుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. వివరాల్లోకి వెళితే... దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గండిమైసమ్మ నుండి దొమ్మరపోచంపల్లి వెళ్లే ప్రధాన రహదారిని పక్కన ఉన్న చింతలకుంట చెరువు ప్రమాదంలో ఉంది. దొమ్మరపోచంపల్లి సర్వేనంబర్ 74లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 12 ఎకరాల 17గుంటల విస్తీర్ణంలో ఉండగా ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లు కలుపుకొని 15 ఎకరాలు ఉన్నట్లు ఇరిగేషన్ లెక్కలు చెబుతున్నాయి. చెరువు పరిసర ప్రాంతాల్లో అనేక లేఅవుట్లు చేసి ప్లాట్లను విక్రయించారు. నాలుగైదు సంవత్సరాల క్రితం వరకు పెద్దగా నిర్మాణాలు చోటు చేసుకోకపోవడంతో చెరువు సుభిక్షంగానేఉంది. మత్స్యకారులు చేపల పెంపకం సైతం చేశారు. అటువంటి చెరువు నేడు అడుగుపెట్టలేని అధ్వాన్నపు స్థితిలోకి చేరుకుంది.

**మురుగు నీరు నేరుగా చెరువులోకి...**

చెరువు పరిసర ప్రాంతాల్లోని మాధవరావుకాలనీ, లక్ష్మీగణపతికాలనీ, శ్రీనివాసకాలనీ, సాయిబాబా కాలనీల్లో మూడు సంవత్సరాలనుండి నిర్మాణాలు జోరందుకున్నాయి. బహుళ అంతస్థుల నిర్మాణాలతో కాస్ట్‌లీ కాలనీలుగా రూపాంతరం చెందాయి. నివాస గృహాల పేరుతో అనుమతుల్లేని హాస్టళ్లకు నిలయంగా మారడంతో జనాభా అంతకుఅంత పెరిగింది. ఆయా కాలనీల నుండి వెలువడే మురుగు నీరు నిత్యం చెరువులోకి ప్రవహిస్తూనే ఉంటుంది. ఫలితంగా చెత్త, వ్యర్థాల డంపింగ్, మురుగు నీరుతో చింతలకుంట చెరువు నిండుతోంది. కాలుష్య కాసారంగా మారి ముక్కు పుటలు అదిరేలా తీవ్ర దుర్గంధం వెజల్లుతుంది. వ్యర్థాలు పేరుకుపోయి దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆక్రమణలు, వ్యర్థాలు పారబోత, మురుగు నీరు మళ్లింపు, కట్టను ఆక్రమించి వ్యాపారాలు ఇలా నలువైపుల నుండి దాడి చేస్తూ చెరువును మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న అధికార యంత్రాంగంలో చలనం లేదు.

**అడ్డగోలుగా అనుమతుల్లేని హాస్టళ్లు...**

చెరువును మురికి కూపంగా మార్చడంలో హాస్టల్ నిర్వాహకులదే ప్రధాన పాత్రగా తెలుస్తుంది. నివాస గృహాల పేరుతో నిర్మాణాలు చేపట్టి ఎటువంటి అనుమతులు, భద్రత చర్యలు లేకుండా హాస్టల్లు నిర్వహిస్తూన్నారు. నిర్మాణాల్లో హాస్టళ్ల ఏర్పాటు చేయాలకున్నప్పుడు అందుకు అనుగుణంగా ఇంకుడుగుంతలు, ఎస్టిపిలు ఏర్పాటు చేసుకోవాలి. అవేమి పట్టనట్లుగా నిర్మాణాల నుండి వెలువడే ప్రతి నీటిబొట్టు డ్రైనేజీ వ్యవస్థలోకి మళ్లిస్తున్నారు. దీంతో మురుగు పొంగి పొర్లుతూ నేరుగా చెరువులో చేరుతుంది.

**హైడ్రా దృష్టిసారించాలి...**

కాంతకాలం క్రితం వరకు కళకళలాడే చెరువు మురుగుతో కంపుకొడుతుంది. పర్యాటకంగా రూపాంతరం చెందాల్సిన చెరువు స్థానిక అధికారులు అలసత్వంతో మనుగడను కోల్పోయేస్థితికి వచ్చింది. చెరువు పూర్తిగా మురికి కూపంగా మారకముందే హైడ్రా అధికారులు దృష్టిసారించాలని చెరువుల పరిరక్షణ సమితి సభ్యులు కోరుతున్నారు. బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తూ చెరువును సుందరీకరించి పూర్వవైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చెరువులో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు



చెరువులోకి ప్రవహిస్తున్న మురుగు నీరు

## ప్రైవేటు కళాశాల ఉద్యోగులను బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు

**నార్సింగి, నవంబరు 28 ప్రభాతవార్త :**

ప్రైవేటు కళాశాల ఉద్యోగులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్న వ్యక్తిని గురువారం నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ప్రశాంత్ అనే వ్యక్తి మా కళాశాలకు నిత్యం ఫోన్లు చేసి బెదిరిస్తున్నాడని, దుర్భాషలాడుతున్నాడని సివిఆర్ కళాశాల మేనేజర్ శ్రీపతి నారాయణరెడ్డి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు వ్యక్తి సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లకు బదులుగా ఆర్థిక ప్రయోజనాలు కావాలని డిమాండ్ చేశాడని ఫిర్యాదులో నారాయణరెడ్డి వివరించారు.

బాధితుల ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు సదరు వ్యక్తిపై నిఘా ఉంచి గురువారం ఉదయం ఫిలింనగర్ పోలీసు స్టేషన్ సమీపంలో ప్రశాంత్‌ను అరెస్టు చేసి, ఉప్పరిపల్లి కోర్టులో హాజరు పరిచారు. న్యాయస్థానం అతడికి 24.రోజుల జుడీషియల్ కస్టడీ విధించిందని, ఈ తరహా దోపిడీకి ఎవరు ప్రయత్నించినా చట్ట పరిధిలో కేసులు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

# అక్రమ కట్టడాలు కూల్చివేత..



అక్రమ కట్టడాలను కూల్చిన దృశ్యం

**నిజాంపేట్, నవంబరు 28, ప్రభాతవార్త**

హైడ్రా కమిషనర్ శ్రీరంగనాథ్ ఆదేశాల మేరకు తహసిల్దార్ బాచుపల్లి, మున్సిపల్ కమిషనర్ నిజాంపేట్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నరేందర్‌రెడ్డి, భానుచందర్, టిపిఎస్ ప్రశాంతిలు కలిసి గురువారం తుర్క చెరువులో బండ బఫర్లో ఉన్న నాలుగు రూములను, అలాగే నిజాంపేట సర్వే నెంబర్ 334లో అక్రమంగా నిర్మించిన ఇళ్లను జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది.


సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

## దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జీడిమెట్ల, నవంబరు 28, ప్రభాతవార్త :** దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కార్పొరేటర్ ఆఫీస్‌లో దీక్ష దివస్ విజయవంతం చేయటానికి పార్టీ నాయకులు, అనుబంధ సంఘ నాయకులతో సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఈనెల 29న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న దీక్షదివస్ కార్యక్రమాన్ని గండి మైసమ్మలోని బిఆర్ఎస్ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అధ్యక్షతన, ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షుడు శంబిపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకనందగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. అభిమానులు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధానకార్యదర్శి పద్మావతి, నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబరు 28, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమంది పేదలు వైద్య సేవలు పొందుతున్నారని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ బాలనగర్ కార్యాలయంలో బండి రమేష్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన గణపతి బేగంపేట్, దేవి పార్వతి కేపిహెచ్బి, పురుషోత్తంరెడ్డి కూకట్పల్లి, కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు రూ.1,52,500 విలువైన చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, ప్రకాష్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, అస్లాం, పిల్లె అరుణ్, బాలరాజు, కృష్ణ, అరుణ్, పర్వేజ్, సరేందర్, శివ, రావుస్, రమాదేవి పాల్గొన్నారు.

## దీక్షా దివస్‌ను విజయంతం చేయాలి : మహేశ్వర్‌రెడ్డి

**కంటోన్మెంట్, నవంబరు 28 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ తలపెట్టిన దీక్ష దివస్‌ను విజయవంతం చేసేందుకు కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లాలని కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదితసాయన్న, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ కోరారు. గురువారం ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన కంటోన్మెంట్ నియోజకవర్గం విస్తృత కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. వ్యక్తిగత విభేదాలు పక్కనబెట్టి బిఆర్ఎస్ పార్టీ పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు చురుకుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు లోకనాథం, నళిని కిరణ్, అనితాప్రభాకర్, మోండా డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆకుల హరిక్రిష్ణ, బిఆర్ఎస్ నాయకులు షర్వీన్, పి.కిరణ్, సృజన్ ముదిరాజ్, బత్తుల నారాయణ, పింజర్ల మురళీ యాదవ్, భవాని, మాధురి, గజ్జెల గోపాల్, భాస్కర్ ముదిరాజ్, పనస శ్రీకాంత్, 4వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నేతలు ఏ.ఎల్. ఆనంద్, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ జడ్జిగా ఎంపికైన ముఖేష్‌కుమార్‌కు సన్మానం


జూనియర్ జడ్జిగా ఎంపికైన పెండెం ముఖేశ్‌ను అభినందిస్తున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

**అడ్డగుట్ట, నవంబరు 28 ప్రభాతవార్త:** దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది మట్టిలో మాణిక్యాలవలే వికసించడం అభినందనీయమని కార్పొరేటర్ లింగాని ప్రసన్నశ్రీనివాస్ అన్నారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్ మురికవాడలో నివాసం ఉంటున్న పెండెం మనోహర్, భవానీల కుమారుడు పెండెం ముఖేశ్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఈ నెల 27న జారీచేసిన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైనందుకు గురువారం లింగాని ప్రసన్నశ్రీనివాస్ ముఖేశ్‌ను, తల్లిదండ్రులకు శాలువకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా వారి పెద్ద కూతురు డాక్టర్ పి.శ్రావని న్యూఢిల్లీ మెడికల్ కాలేజీలో అనస్తిషియాలో పిజీ చేస్తుంది. చిన్న కుమార్తె ఐశ్వర్య గ్రూప్-1 మెయిన్స్ రాయడం అభినందనీయమన్నారు. అదే విధంగా అడ్డగుట్టలోని అన్ని వర్గాల ప్రజలు విదా ్యరంగా అభివృద్ధి చెంది ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె అకాంక్షించారు.

## డిశంబరు 2న శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో హుండీ లెక్కింపు

**బేగంపేట, నవబరు 28, ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో డిశంబరు 2న ఉదయం గం 10లకు హుండీల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబరు సురిటి కామేశ్వర్, మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్లు, భక్తుల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందని తెలియజేసారు.

## ఉత్తమ డ్రైవర్లను స్ఫూర్తిగా తీసుకోవాలి : ఆర్.ఎం.ఖాన్

**అడ్డగుట్ట, నవంబరు 28 ప్రభాతవార్త:** రోడ్డు భద్రతా సూత్రాలను పాటిస్తూ 30 యేండ్ల పాటు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ఉత్తమ డ్రైవర్లను స్ఫూర్తిగా తీసుకొని విధులు నిర్వహించాలని ఆర్టీసి సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖు స్రోషఖాన్ తెలిపారు. గురువారం హెచ్‌సియు డిపోలో నిర్వహించిన సికింద్రాబాద్ రీజియన్ ఉత్తమ డ్రైవర్ల అభినందన సభలో కంటోన్మెంట్ డిపోకు చెందిన పత్తి చంద్రమౌళి (పిసీ మౌళి) అనే డ్రైవర్ 30 యేండ్ల నుంచి ఎలాంటి ప్రమాదాలు జరపకుండా అత్యధిక కె.ఎం.పి.ఎల్. సాధించిన పిసీ మౌలిని ఆర్టీసి ఉన్నతాధికారులు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం.లు బి.బి.రెడ్డి, కవిత, కంటోన్మెంట్ డిఎం సుధాకర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ డ్రైవర్‌ను అభినందిస్తున్న ఆర్టీసి ఆర్.ఎం.ఖాన్, బి.బి.రెడ్డి

# ఉపాధ్యాయులు దుమ్మాకొడితే తెలియజేయండి : ఎమ్మెల్యే


మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబరు 28 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్న మధ్యాహ్న భోజనంలో ఎంతో నాణ్యత ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. గురువారం 3వ వార్డు మడ్‌ఫోర్డ్ ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనంలోని నాణ్యత ప్రమాణాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని టీచర్లు తినాలని, తద్వారా నాణ్యత ఎలా ఉంటుందని తెలుస్తుందన్నారు. దీని వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కలుగుతుందన్నారు. పాఠశాలల్లో టీచర్లు సక్రమంగా పాఠాలు చెప్పకపోయినా, దుమ్మాలు కొట్టినా మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించినా వెంటనే ఫోన్ చేయాలని విద్యార్థులకు ఎమ్మెల్యే ఫోన్ నెంబర్ ఇచ్చారు.

**కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే...**

ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉంది కానీ, అన్నం, కూరలు చల్లబడి ఉన్నట్లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ఫోన్ ద్వారా తెలియజేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని ఏర్పాటు చేస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామన్నారు. అదేవిధంగా విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా మెట్రో రైల్ 7 వ వార్షికోత్సవం

**పంజగుట్ట, నవంబరు 28 (ప్రభాతవార్త):** హైదరాబాద్ ప్రజా రవాణావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చే దిశగా మెట్రో ముందుకు సాగుతుందని హెచ్ఎంఆర్ఎల్ యండి ఎన్‌విఎస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రారంభించి ఏడు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో ఏడవ వార్షికోత్సవ సంబరాల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగర పరిస్థితుల్లో పరివర్తన తెచ్చే దిశగా ప్రస్తానం మొదలుపెట్టి, ఏడు సంవత్సరాలుగా విజయవంతంగా కార్యకలాపాలు నిర్వహించడాన్ని నేడు వేడుకగా నిర్వహించుకుంటున్న తరుణంలో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ యొక్క స్వభావం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. హైదరాబాద్ మెట్రోరైల్ అనేది రవాణా మాధ్యమం మాత్రమే కాదని, ఆర్థిక వృద్ధి, సామాజిక అభివృద్ధి, సుస్థిర పర్యావరణకు ఉత్ప్రేరకం లాంటిదన్నారు. వాయు నాణ్యతను మెరుగుపరచి, ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించిందన్నారు. మెట్రో రెండో దశ పనులు కూడా త్వరలో పూర్తవుతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు 48 శాతం బ్యాంక్‌ల నుండి రుణాలు తీసుకోదలచామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేంత్‌రెడ్డి కూడా మెట్రో విస్తరణకు ఆసక్తిగా ఉన్నారని, ఇప్పటికే ప్రభుత్వం పాతబస్తీలో భూసేకరణకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. ఎల్ అండ్ టి యండి అండ్ సీఈవో కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్ట్ అమలులో ఎదురైన సవాళ్లను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మెట్రోరైల్‌ను తీర్చిదిద్దే ప్రస్థానమనేది ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వాముల శక్తికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. మెట్రో మూడు కారిడార్ల వ్యాప్తంగా మొత్తం 57 స్టేషన్‌లకు ఐజిబిసి ప్లాటినం సర్టిఫికేషన్ లభించడం అనేది గర్వకారణమని, భారత్‌లో ఈ ఘనతను సాధించిన ఏకైక మెట్రో హైదరాబాద్ మెట్రో కావడం గమనార్హమన్నారు. ఇప్పటి వరకు ఎన్నో కీలక మైలురాళ్లు, విజయాలు సాధించిన మెట్రో నగరవాసుల ఆదరణ ఎంతగానో పొందడం మెట్రో సౌకర్యానికి, పనితనానికి నిదర్శనమన్నారు.


పేట్ బషీర్‌బాగ్ సిఐని సన్మానిస్తున్న ముప్పిడి గోపాల్ తదితరులు

## సిఐని సత్కరించిన ముప్పిడి గోపాల్

**అడ్డగుట్ట, నవంబరు 28 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్ గురువారం పేట్ బషీర్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేష్ కుమార్, వేణుగోపాల్, హన్మంత్ పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

### సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

**బేగంపేట నవంబరు 28, ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట డివిజన్ పరిధిలోని గైదిన్ బాగ్‌లో పునర్నిర్మించిన శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా నవగ్రహాల ప్రతిష్ట సందర్భంగా నిర్వహించిన పూజలలో పాల్గొన్నారు. ముందుగా ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నవగ్రహాల ప్రతిష్ట పూజలలో పాల్గొన్నారు. పూజల అనంతరం ఆలయ నిర్వహకులు ఎమ్మెల్యే తలసానిని ఆలయ నిర్వహకులు ఘనంగా సత్కరించారు. జనరల్ బజార్‌లోని శ్రీ మల్లిఖార్జున స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన అన్నకోటి పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జునగౌడ్, అత్తెల్లి అరుణాగౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ నాయకులు ఆంజనేయులు, విజయ్, అరుణ్‌భట్, మహేష్ యాదవ్, మహేందర్, బస్తీవాసులు రత్నాకర్, ఆనంద్, ప్రవీణ్, కళ్యాణ్, లావణ్య, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ మహిళల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జట్టు సెలక్షన్స్..

**నిజాంపేట్, నవంబరు 28, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, సీనియర్ మహిళల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కబ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు మధ్యాహ్నం 2 గంటలకు సీనియర్ మహిళల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జట్టు సెలక్షన్స్ కాసాని కబడ్డీ అకాడమీ, బాచుపల్లి నందు జరుగుతాయని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ చంద్రహాస్ తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనదలచిన వారు మహిళా కబడ్డీ క్రీడాకారులు 75 కేజీల లోపు వారు తమ ఆధార్‌కార్డుతో నేడు మధ్యాహ్నం 2 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు షకీల్ 7396749998 నంబర్‌పై సంప్రదించగలరని తెలిపారు. ఎంపికైన సీనియర్ మహిళల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా జట్టు హైదరాబాద్ ఎల్.బీ.స్టేడియం నందు 07.12.2024 నుండి 10.12.2024ల మధ్య నిర్వహించే 71వ సీనియర్ మహిళల అంతర్ జిల్లా కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా మహిళా జట్టు పాల్గొంటుందని తెలిపారు.


జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## నాంపల్లి కోర్టులో జ్యోతిరావు పూలే వర్ధంతి సభ

**హైదరాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త :** అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడని, సమాజములో అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు పాటుపడిన మహానుభావుడు జ్యోతిరావు పూలే అని వక్తలు కొనియాడారు. గురువారం నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్, జ్యోతిరావు పూలే కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి కోర్టులో జ్యోతిరావు పూలే వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు రాజవర్ధన్ రెడ్డి, చింతల కృష్ణ, రాజిరెడ్డి, కొండూరు వినోద్, కరిక మల్లేష్ మాట్లాడుతూ భారత సామాజిక సంస్కరణ ఉద్యమంలో జ్యోతిరావు పూలే ముఖ్య పాత్ర పోషించారని కొనియాడారు. సమాజంలో వెనుకబడిన ప్రజల, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన జ్యోతిరావు పూలేకు మహాత్మా బిరుదు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖాదిర్, అప్పారావు, ఆలేటి యాదగిరి, ఎ గోకుల్, ఎం రమేష్, సి విష్ణు, కిషన్ చౌహాన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పూలే సమాజానికి చేసిన కృషి, సేవలు మరువలేనిది:రాజశేఖర్


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు

**సైఫాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** భారతదేశంలో అనగారిన వర్గాలకు మహాత్మా జ్యోతిరావ్‌పూలే, ఆయన భార్య సావిత్రిబాయిపూలే చేసిన కృషి, సేవలు, త్యాగం మరువలేనిదని నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎ.వి.రాజశేఖర్ కొనియాడారు. సామాజిక న్యాయంతోపాటు అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికారం కోసం పూలే చూపిన మార్గం నేటికి అనుసరణీయమని ఆయన చెప్పారు. గురువారం కళాశాల ప్రాంగణంలో పూలే 134వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి ప్రిన్సిపల్ పూలమాల వేసి నివాళులు అర్పించి, మాట్లాడారు. పూలేని స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం అధ్యాపకులు, విద్యార్థులు సమాజానికి సేవలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.ఉపేందర్‌రెడ్డి, బిసి సెల్ కో-ఆర్డినేటర్ డా.సి.హెచ్.వెంకటేశ్వర్లు, పిఆర్ఓ కవితాషిండె, అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల కర్తవ్యం : సిఐ

**అఫ్జల్‌గంజ్, నవంబరు 28 ప్రభాతవార్త:** శాంతి భద్రతలను కాపాడేందుకు గాను ప్రజలు పోలీసులకు సహకరించాలని అబిడ్స్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఇమ్యూనల్ అన్నారు. ఇక్కడ విధులను నిర్వహించిన రాజ్‌గోపాల్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఇమ్యూనల్ పదవి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన వ్యాపార కేంద్రాలైన జగదీష్ మార్కెట్, బిగ్‌బజార్ కూడా నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతిభద్రతలను కాపాడటమే పోలీసుల కర్తవ్యమన్నారు.

# చిత్రకళాప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరణ

**నాంపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థిని ఉమేశ్వరి దీపబహదూర్, మారిషస్ విశ్వవ్యాప్తంగా గొప్పచిత్రకళాకారిణిగా ఖ్యాతిగాంచడం విశ్వవిద్యాలయానికే గర్వకారణమన్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మారిషస్‌లో ఉంటూ 24ఏళ్ల తర్వాత విద్యనభ్యసించి భారత దేశంలోని హైదరాబాద్‌లో చిత్రకళాప్రదర్శనను ఏర్పాటు చేసి తన ప్రతిభను ప్రదర్శిస్తూ అందరితో పంచుకోవడం హర్షదాయకమని ఆమెకు శుభాశీస్సులందజేశారు.

ఈమేరకు గురువారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని తనచాంబర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ, పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 3న ఉదయం 11 గంటలకు రవీంద్రభారతిలో నిర్వహించనున్న చిత్రకళాప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను నిత్యానందరావు ప్రముఖ చిత్రకారుడు మహేష్, చిత్రకారిణి ఉమేశ్వరి, పికాసో ఆర్ట్స్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు బైరు రమేష్‌లతో కలిసి ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిత్యానందరావు, బైరిరమేష్, ఉమేశ్వరి, మహేష్‌లు

చిత్రకళాకారిణి ఉమేశ్వరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చిత్రకళాప్రదర్శనలు నిర్వహిస్తూ ప్రశంసలందుకున్నట్లు, 24ఏళ్ల తర్వాత విద్యభ్యసించి హైదరాబాద్‌లో మొదటిసారి నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, యువజన క్రీడాశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు డిసెంబరు 3న ఉదయం 11గంటలకు ప్రారంభిస్తారని, ఔత్సాహికుల సందర్శనార్థం 7వ తేదీవరకు ప్రతీరోజూ ఉదయం 11 నుండి రాత్రి 7గంటల వరకు తెరిచి ఉంటుందని వివరించారు.


బలరామ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మదన్‌గౌడ్

## కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**పేట్ బషీరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త :** కార్మికుడి కుటుంబానికి మదన్‌గౌడ్ అండగా నిలిచారు. జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలోని గల అరోరా ఫార్మా కంపెనీలో ఈనెల 20వ తేదీ ఉదయం 10:25 నిమిషాలకు ఎం.బలరామ రియాక్టర్‌ను సరైన సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోకుండా క్లీనింగ్ చేస్తుండగా పేలిపోయింది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు ప్రమాదానికి గురయ్యారు. ఈ విషయాన్ని కార్మికుల కుటుంబ సభ్యులకు సాయంత్రం 5 గంటల వరకు తెలియచేయలేదు. కాగా బలరాం కుటుంబ సభ్యులు కార్మిక నాయకుడు ముద్దాపురం మదన్ గౌడ్‌ని కలిసి జరిగిన విషయం తెలియజేశారు. వెంటనే మదన్‌గౌడ్ అమీర్‌పేటలోని వెల్‌నెస్ హాస్పిటల్‌కి వెళ్లి కార్మికుడి చూసి పరామర్శించారు. అనంతరం కంపెనీ మేనేజ్‌మెంట్‌ను పిలిపించి మాట్లాడారు. ఈ మధ్యకాలంలో మీ కంపెనీలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, దాన్ని మీరు దృష్టిలోకి తీసుకొని ప్రమాదాలు జరగకుండా కార్మికులకు కావాల్సిన సేఫ్టీ ప్రికాషన్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా ఈ నెల 23వ తేదీన కార్మికుడు బలరామ మృతి చెందాడు. కార్మికుడు బలరాం కుటుంబానికి రూ. 45 లక్షల ఇప్పించి రూ. 34 వేలు హాస్పిటల్ ఖర్చుతో పాటు మరో లక్ష రూపాయలు ఇప్పించారు. బలరామ కుటుంబ సభ్యులు మదన్‌గౌడ్‌ని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కె.శుభాష్, కె.రాంబాబు, సుమ్మిత్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం


కార్మిక కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న సుదర్శన్‌రెడి

**పేట్‌బషీరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త :** ఇటుకలు పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన తెలుసుకొన్న తక్షణమే ప్రమాద స్థలానికి టిపిసిసి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షుడు కందాడి సుదర్శన్‌రెడ్డి, కొంపల్లి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కర్కల ఉపేందర్‌రెడ్డి, దూలపల్లి డప్పు నరేందర్, నాగరాజుయాదవ్ తదితరులు సంఘటనపై స్పందించి అక్కడి బిల్డర్లను మానవతా దృక్పథంతో సహాయం చేయాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం కింద రూ. 13 లక్షలు ఇస్తామని ఒప్పుకొని వారు తక్షణమే గురువారం కొంత నగదు సహాయం కింద బాధిత కుటుంబానికి ప్రమాద స్థలములో ఇప్పించడం జరిగింది.

## ఆడపిల్లలకు అండగా కాలనీవాసులు


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న కాలనీ వాసులు

**పేట్‌బషీరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త :** సావిత్రి అనే అమ్మాయి హెచ్ఎల్ రాఘవేంద్ర కాలనీ సుచిత్ర కుత్బుల్లాపూర్‌లో 15 సంవత్సరాల నుండి ఇళ్లల్లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. 15 రోజుల కిందట డెంగ్యూ ఫీవర్ వచ్చి హాస్పిటల్లో జాయిన్ అయితే ప్లేట్లెట్స్ తగ్గిపోయి ప్రమాదవశాత్తు మృతి చెందింది. ఆమెకు నలుగురు కూతుళ్లు. దీంతో కాలనీ ప్రెసిడెంట్ కుంట సిద్ది రాములు ఆధ్వర్యంలో వారి కుటుంబానికి సహాయార్థంగా, తలా కొంత అమౌంట్ రూ. 41,500 జమ అయినవి, వాటిని గురువారం సావిత్రి పిల్లలకు అందజేయడం జరిగింది. మానవతా దృక్పథంతో ఈ కార్యక్రమానికి సహకరించిన మా కాలనీవాసులు అందరికీ కాలనీ ప్రెసిడెంట్ కుంట సిద్ది రాములు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాలనీల అభివృద్ధికి కృషి : జంపన ప్రతాప్


సమస్యలు తెలుసుకుంటున్న జంపన ప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబరు 28 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే శ్రీగణేష్, సీఈఓ మధుకర్‌ల దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. గురువారం 1వ వార్డులోని పవన్ విహార్ కాలనీ, ఆకాశ్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిధిలో రూ.11 లక్షలతో వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్, అకాశ్ నగర్‌లో రూ.3.50 లక్షలతో ఇనుప కంచె, షెటిల్ కోర్టు, క్రికెట్ గ్రౌండ్ ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు పి.బి.రెడ్డి, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, ప్రదీప్, కె.ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**గచ్చిబౌలి, నవంబరు 27 ప్రభాతవార్త :** ఐటి కారిడార్‌లో ఉన్న మురుగు కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని బ్రాడ్ కామ్ సాఫ్ట్‌వేర్ సంస్థ ముందు ఉన్న మురుగు నీటి కాలువ వద్దకు 27వ తేదీన మద్యాహ్నం 1గంట ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లాడు. ఓపెన్ డ్రెయిన్ కావడంతో పట్టుజారి మురుగు నీటి కాలువలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలైన గుర్తు తెలియని వ్యక్తి కాలువలోనే మృతిచెందాడు. కాగా ఈ విషయాన్ని ఎవ్వరూ గమనించకపోవడంతో గురువారం ఉదయం స్థానికులు మురుగు నీటి కాలువలో మృత దేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తికి 40నుంచి 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతుడి ఆచూకీ కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకపోయిందని పోలీసులు తెలిపారు. మృతుడు కాలువలో పడిపోయిన దృశ్యాలు స్థానికంగా ఉన్న సిసి కెమెరాలో రికార్డు అయ్యాయని పోలీసులు తెలిపారు. మృతుడి వేషదారణ చూస్తే యాచకుడిగా భావిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇప్పించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరుతున్న పీరంచెరువు మాజీ సర్పంచ్ బలరాం

## డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇప్పించాలని వినతి

**నార్సింగి, నవంబరు 28 ప్రభాతవార్త :** ఆయన గండిపేట మండలం పీరంచెరువు గ్రామానికి సర్పంచ్‌గా బాధ్యలు నిర్వర్తించాడు. నిజాయితీగా పనిచేసి, గ్రామాభివృద్ధికి కృషిచేశాడు. ఇప్పుడు ఆరోగ్యం క్షీణించి, ఉండేందుకు కనీసం ఇల్లుకూడా లేక అవస్థలు పడుతున్నాడు. ఆసుపత్రులకు అయ్యే ఖర్చులు భరించలేక, ఇంకొకరి వద్ద చెయ్యి చాపలేక జీవితంను వెళ్లదీస్తున్నాడు. మాజీ సర్పంచ్ బలరాం దుస్థితిని చూసిన కాంగ్రెస్ నాయకుడు గణేష్ ఆయనను ఆదుకోవాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. ఎమ్మెల్యేను కలిసిన తరువాత బలరాం మాట్లాడుతూ తన పరిస్థితి దయనీయంగా ఉందని, తలదాచుకునేందుకు ఇళ్లు కూడా లేదని, డబుల్ బెడ్‌రూం ఇల్లుఇప్పించి ఆదుకోవాలని కోరారు. మాజీ సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించి సొంత ఇళ్లు కూడా కూడబెట్టలేకపోవడం అతడి నిజాయతీని తెలియజేస్తుందని, ఇలాంటి నిజాయితీ పరుడికి నావంతు సహకారం అందజేస్తానని, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని అధికారులకు రెకమండ్ చేస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హామీనిచ్చారు. ఎమ్మెల్యే స్పందన పట్ల బలరాం ఆనందపరవశులయ్యారు. బీదల పట్ల ఎమ్మెల్యే స్పందిస్తున్న తీరు వల్లనే వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందుతున్నారని, నాకు ఇళ్లు ఇప్పిస్తే, జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటానని మాజీ సర్పంచ్ బలరాం పేర్కొన్నారు.

## 'మాలల సింహగర్జన'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నర్మెట్ట మల్లేష్

**చిక్కడపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త:** డిసెంబరు ఒకటిన పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే 'మాలల సింహగర్జన' సభను విజయవంతం చేయాలని మాలకులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్త దయానంద్, మాల మహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్ పిలుపునిచ్చారు. గురువారం భారతరాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని మాలమహానాడు రాష్ట్ర కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. మాస్టర్ దయానంద్, నర్మెట్ట మల్లేష్ మాట్లాడుతూ బిఆర్. అంబేద్కర్ రచించిన భారతరాజ్యాంగంలో బడుగువర్గాల కోసం ఆర్టికల్స్ గురించి ప్రతి ఒక్క వ్యక్తి తెలుసుకుని వారి హక్కులను సాధించుకునే ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తల్లమల్ల కాశీనాథ్(సురేందర్), మన్నె శ్రీధర్, దళిత హక్కుల రక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బొనగిరి మంగ,కె.రమేశ్, నాగెల్లి కృష్ణ, ఎన్.వెంకటేశ్, జి.యాదగిరిరావు, నిరుడు నర్సింగరావు, లక్ష్మణ్‌రావు, ఎన్.రవీందర్, ఎంవిఎస్ ఉపాధ్యక్షుడు లోకేశ్, సదానంద్,వాళ్ళమళ్ళ శ్రీనివాస్, బల్వంత్, బానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 'హమారా సంవిధాన్-హమారా స్వాభిమాన్'



కార్యక్రమంలో పాల్గొన్న రాజేందర్, డాక్టర్ డి.సృజన తదితరులు

**చిక్కడపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త:** రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు లవగాహన కలిగి ఉండాలని తెలంగాణ జుడిషియల్‌అకాడమి పూర్వ డైరెక్టర్ డాక్టర్ మంగారి రాజేందర్ అన్నారు.బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'హమారా సంవిధాన్-హమారా స్వాభిమాన్' నినాదంతో భారత రాజ్యాంగ దినోత్సవ సభ జరిగింది. డాక్టర్ మంగారి రాజేందర్ మాట్లాడుతూ నేడు మనమంతా భారతరాజానయంగ ఫలాలను అనుభవిస్తున్నామన్నారు.కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా మన నియమాలు, నేటి ప్రభుత్వం ఆధారపడి ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కళాశాలకు చెందిన ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, క్రీడల విభాగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లా కళాశాలప్రిన్సిపాల్ డాక్టర్ డి.సృజన హాజరై ప్రసంగిస్తూ భారత రాజ్యాంగం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు ఘంటసాల

### -ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం

**చిక్కడపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త:** సినిమాలలో భక్తి, వైరాగ్య, ప్రేమ, విరహ పాటలు ఎన్నో పాడిన ఘంటసాల భగవత్‌గీత గానంతో చిరస్మరణీయుడు అయ్యారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ (ఇండియా) అధినేత డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో విఖ్యాత గాయకుడు ఘంటసాల భగవత్‌గీత గానం చేసిన యాభైఏళ్ళు అయిన సందర్భంగా 'భగవత్‌గీత స్వర్ణోత్సవం సంగీత బంధురం' నిర్వహించారు. ప్రముఖ గాయకులు బాలకామేశ్వరరావు, ఫణి, చింతలపాటి సురేశ్, హృషికేశ్‌లు ఘంటసాల పాడిన గీతాలతో శ్రోతలను తన్మయులను చేశారు. అనంతరం సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఓలేటి పార్వతీశం గాయకులను సత్కరించి ప్రసంగించారు. ఘంటసాల చివరి రోజుల్లో పాడిన గీత ప్రతి తెలుగు వారి ఇంటికి చేరిందన్నారు. విదేశాల్లో సైతం ఘంటసాల గీతాగానం,సుప్రభాతంలా వింటున్నారన్నారు. ఘంటసాలపై అత్యంత భక్తితో వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు గుడికట్టి ఆయనకు నిత్యపూజలు చేయడం విశేషం అని అన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతఉూ ఘంటసాల కుటుంబంతో తమకు ఆత్మీయత ఉందని, ఘంటసాల కేవలం గాయకుడు కాదనీ, ఆయన స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని జైలుజీవితం గడిపారని గుర్తుచేశారు. భారతరత్నగా కేంద్రం గుర్తించాలని కోరారు. తాను కుంట్లూరులోని వేగేశ్న అనాథ బాలల ఆశ్రమంలో ఏళ్ళ తరబడి ఘంటసాలకు దేవాలయం నిర్మించి నిలువెత్తు విగ్రహం ఏర్పాటుచేసి తనభక్తి చాటుకుంటున్నానని అన్నారు. నిర్వాహకులు సుంకరపల్లి శైలజ, డాక్టర్ తెన్నేటి సుధా తదితరులు పాల్గొన్నారు.



గాయకులను సత్కరించిన దృశ్యం

# ఐడిపిఎల్ చౌరస్తాలో విద్యార్థుల రాస్తారోకో

**కుత్బుల్లాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త**

గురుకుల, ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థుల మరణాలు, కలుషిత ఆహారసరఫరాకు నిరసనగా అఖిల భారతీయ విద్యార్థి భవిషత్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఐడిపిఎల్ చౌరస్తాలో భారీ రాస్తారోఖో నిర్వహించారు.దీంతో బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుండి కుత్బుల్లాపూర్ చౌరస్తా వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ అయ్యింది. పోలీసులు ఒక్కసారిగా అదుపుచేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతోపాటు విద్యార్థులు భారీఎత్తున చేరుకుని ఐడిపిఎల్ చౌరస్తాలో విద్యార్థినీ, విద్యార్థులు బైఠాయించారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈసందర్భంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, మేడ్చల్ జిల్లా ఎబివిపి కన్వీనర్ నాగేశ్‌లు మాట్లాడుతూ ఒక్క సంవత్సరకాలంలో గురుకులాలలో మొత్తం 886 మంది కలుషిత ఆహారంతో అనారోగ్యానికి గురికాగా అందులో 51 విద్యార్థిలు మరణించారని, 24 మంది పిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని, మరో ఎనిమిది మంది విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారని ఆదోళన వ్యక్తంచేశారు. నలుగురు పిల్లలకు సరైన తిండి పెట్టకపోవడంతో మృతిచెందగా మరో 14మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని మృతిచెందారన్నారు. రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్యవైఖరికి నిరసనగా ఎబివిపి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ ఆందోళన నిర్వహించారు. తక్షణం గురుకుల పాఠశాలలలో జరుగుతన్న మృతులపై పూర్తి విచారణ జరిపి దోషులను శిక్షించడంతోపాటు గురుకుల, ఆశ్రమపాఠశాలల పరిస్థితులను మెరుగు పర్చాలని వారు డిమాండ్ చేశారు. ఆందోళనలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ ఆత్మకూరి శ్రీనాథ్, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు పడమటి భరత్‌రెడ్డి, ఆయుష్, కూకట్‌పల్లి నగర కార్యదర్శి ధనుంజయ్, రాఘవేంద్ర, గణేష్, చరణ్, ఆకాశ్ తదితరులు ప్రసంగించారు. బాలానగర్ , జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీస్‌స్టేషన్లకు తరలించారు.



చింతల్ ఐడిపిఎల్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఎబివిపి విద్యార్థులు

# ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే కఠిన చర్యలు

**నార్సింగి, నవంబరు 28 ప్రభాతవార్త :**

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని గండిపేట మండల తహిసల్దార్ శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. గురువారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామ సర్వే నెంబర్ 132.లో వెలిసిన కొన్ని బేస్‌మెంట్లను, గదులను రెండు జేసీబీల సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు పెడ్తామని స్పష్టం చేశారు. సామాన్యులైనా, బడాబాబులైనా ఎవరైనా సర్కారు భూముల జోలికి రావద్దని సూచించారు. నేను ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్నంత కాలం ఎవరూ ప్రభుత్వ భూముల వైపు కన్నెత్తి చూడవద్దని, ఇక నుంచి ఎవరైనా కబ్జాకు యత్నిస్తే జైలుకు పంపిస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు రెవెన్యూ యంత్రాంగం విధులు నిర్వహిస్తుందని, మా కళ్లుగప్పి ఎవరూ ఏమీ చేయలేరని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలన్నింటిని పర్యవేక్షించేందుకు గండిపేట మండలంలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని, నిత్యం ఓ రౌండ్ ప్రభుత్వ స్థలాలను వారు పరిశీలించి మాకు రిపోర్టులు అందజేస్తారని తహసీల్దార్ వివరించారు. ప్రభుత్వ స్థలమంటే ప్రజలందరిదని, దీన్ని భావి తరాల అవసరాల కోసం కాపాడుకునే బాధ్యత ప్రతీ పౌరుడిపై ఉందన్నారు. మండల పరిధిలో ఎక్కడైనాసరే ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే, కబ్జా చేస్తే స్థానిక ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలని, మాకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వట్టినాగులపల్లిలోని వెలిసిన అక్రమ నిర్మాణాలను జేసీబీలతో కూల్చి వేస్తున్న రెవెన్యూ అధికారులు

# ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

**సైఫాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా వెట్టిచాకిరి చేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటి యుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ప్రేమ్‌పావని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. కార్యకర్తలకు కనీస వేతనాలు లేక పనివత్తిడితో నిత్యం అనారోగ్యానికి గురవుతున్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఎఐటియుసి కార్యాలయంలో జరిగి రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఆశా కార్యకర్త లను తొలుత డ్యూటిలోకి తీసుకునేటప్పుడు రోజులో కొద్ది సమయం మాత్రమే పని చేయించుకుంటూ గౌరవ వేతనాన్ని ప్రభుత్వం చెల్లించేదని, కాని ప్రస్తుతం ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ పేరిట 8 గంటలకు పైబడి పనిచేయించ కుంటూ కనీస వేతనాలు చెల్లించకుండా అధికారులు తీవ్ర అన్యాయం చేస్తు న్నారని ఆరోపించారు. ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో నిత్యం పనులు చేయించు కుంటున్న ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీకి పాల్ప డుతున్నదని ఆరోపించారు. ఆశా కార్యకర్తలు నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజల ఆరోగ్యం కోసం శ్రమిస్తుంటే ప్రభుత్వం వారిని గుర్తించకపో వడం అన్యాయమన్నారు. కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ త్వరలో ఎఐటియుసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.




మాట్లాడుతున్న ప్రేమ్‌పావని, చిత్రంలో ఎం.నర్సింహా తదితరులు

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే గాంధీ

**హైదరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త**

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పిఎసి ఛైర్మన్ ఆరెక్పూడి గాంధీ అన్నారు. గురువారం కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో భాగంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశ పెట్టడం గొప్ప విషయమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, ఇబ్రహీం, కాశీనాథ్, శాస్త్రి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషి

**పటాన్‌చెరు, నవంబరు 28,ప్రభాతవార్త:** పటాన్ చెరు నియోజకవర్గంలోని ఇంద్రేశం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బిసి బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కిచెన్ షెడ్డు డైనింగ్ హాలు, స్టోర్ రూమ్, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. మరుగుదొడ్లు కిటికీలు డోర్ లకు అవసరమైన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపల్ ఆదేశించారు. భవనం యజమానితో మాట్లాడి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. జిల్లాలోని అన్ని కస్తూరిబా పాఠశాలలో సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు తాసిల్దారులు ఎంఈవోలు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకత నిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనమందేల చూడడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగు కోసం చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. అధికారులు వారి స్థాయిలో జరిగే మరమత్తు పనులను ఆయా భవనాల యజమానులతో మాట్లాడి వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థులకు మేలు ప్రకారం నాణ్యమైన భోజనం అందాల చూడాలని ఎక్స్పైరీ డేట్ దాటిన వస్తువులు వాడకూడదు అని సూచించారు. వసతి గృహాలకు గురుకుల పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యతతో ఉండేలా పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిఇ కిరణ్‌కుమార్, తహసిల్దార్ రాంబాబు, వసతి గృహ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యాధికారమే లక్ష్యంగా బిసిలు ఐక్యం కావాలి

### బిసిఎఫ్ కన్వీనర్ నాగనమోని చెన్నరాములు ముదిరాజ్




మాట్లాడుతున్న చెన్నరాములు ముదిరాజ్

**హైదరాబాద్, నవంబరు 28,ప్రభాతవార్త:**

దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలం రాజ్యాధికారం చేతికించుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని బ్యాక్ వర్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ (బిసిఎఫ్) కన్వీనర్ నాగనమోని చెన్నరాములు ముదిరాజ్ పిలుపునిచ్చారు.ఈమేరకు గురువారం జ్యోతిబాపూలే వర్ధంతిని పురస్కరించుకొని బీసీఎఫ్ ఆవిర్భావ సభను సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేశారు. కన్వీనర్ రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ నేత, నటుడు జై హిందు గౌడ్ తో పాటు వివిధ జిల్లాలకు చెందిన బీసీ నాయకులు హాజరయ్యారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల అర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాములు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్ల పూర్తయినా అధిక జనాభా కలిగిన బీసీలు పాలితులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూలే ఆశయాల సాధన కోసం బిసిఎఫ్ ఆవిర్భవించిందని అన్నారు. అగ్ర వర్ణాలను యాచించే స్థితి నుంచి శాసించే స్థితికి బీసీలు ఎదిగేందుకు బిసిఎఫ్ పాటుపడుతుందని అన్నారు.

జిల్లా మండల గ్రామీణ స్థాయి వరకు బిసిఎఫ్ ను ఏర్పాటు చేసి బలమైన పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్ గా పిట్టల భూమేష్, ప్రధాన కార్యదర్శిగా మహతి రమేష్ నాయి, కార్యదర్శిగా ప్రశాంతి యాదవ్, మహిళా అధ్యక్షురాలుగా సీతా మహాలక్ష్మి, గౌరవ అధ్యక్షురాలిగా కొండ లతా బాయ్, ప్రధాన కార్యదర్శిగా అచ్చమ్మ లను ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు.

## అభ్యుదయవాది మహాత్మా జ్యోతిరావు పూలె

**గోషామహల్, నవంబరు 28 ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతి రావు పూలే మహిళా అభ్యుధయ వాది, నిరంతరం మహిళాభివృద్దికిపాటు పడిని ఆదర్శప్రాయుడని మహాత్మాజ్యోతిరావు పూల్ యువమంచ్ రాష్ట్ర అధ్యక్షుడు గురుచరణ్ అన్నారు.గురువారం మహాత్మా జ్యోతి రావు పూలే యువ మంచ్ ఆద్వర్యంలో జ్యోతిరావు పూలే 134 వర్ధంతిని పురస్కరించుకుని పురానాపూల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలేను గురువుగా భావించిన అంబేద్కర్ విగ్రహం వద్ద 125 అడుగుల జ్యోతిరావుపూలే విగ్రహన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు పి.మహేందర్, అధికార ప్రతినిధి ఎం.ప్రభాకర్, పోల్లేనాగేష్, జి.జగన్, కోర్ని ప్రవీణ్‌కుమార్ బ్రది, కళ్యాణి నందేష్, పి.గోపాల్, రామ్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

## బడుగుల పిడికిలి జ్యోతిరావుపూలే

### గౌడ సంఘాల సమన్వయ కమిటీ

**హైదరాబాద్, నవంబరు 28, ప్రభాతవార్త :** నోరులేని ప్రజలలో చైతన్యం రగిల్చిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావుపూలే అని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆత్మ బంధువు,, సంఘసంస్కర్త, మహిళా దినోద్దారకుడు, హక్కుల కోసం గులాంగిరి చేయొద్దన్న సమసమాజ స్థాపకుడు, బహుజనుల వజ్రాయుదం పూలే అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పోతగాని ఐలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలె

### -గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్



పూలె విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**చిక్కడపల్లి, నవంబరు 28 ప్రభాతవార్త:** సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసి, అణగారినవర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మజ్యోతిబాపూలే అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. గురువవారం మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి కార్యక్రమంలో డివిజన్‌లోని అరుంధతినగర్ బస్తీ ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో బిజెపి ఓబీసీమోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయకుమార్, డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్, సీనియర్ నేతలు ఆనంద్(ఆనంద్), శ్రీకాంత్,పి.నర్సింగరావు,లక్ష్మణ్‌యాదవ్, సత్యం దోనేటి, నర్సింహ, బద్రీనారాయణ, రమేశ్‌గౌడ్, డి.శ్రీనివాస్ మూదిరాజ్, రాజశేఖర్, రవి, కనకేశ్,రాజు, నీరజ్, ధనరాజ్ పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం

**సిద్దిపేట రూరల్, నవంబరు 28, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో సిఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్బంగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. గెలుపొందిన ప్రతి జట్టుకు నిర్వాహకుల చేతుల మీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందిస్తున్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజం : పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు క్రీడల్లో గెలుపోటములు సహజమని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు)అన్నార ు. సిద్దిపేట మినీస్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం విజయం సాధించిన చింతమడక జట్టుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి టోర్నీలు ఎంతో దోహదపడుతాయన్నారు. టోర్నీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

**NOTICE**

NOTICE is hereby given that the partnership heretofore subsisting between the undersigned.
1. Smt. BNS PRASANNA LAXMI W/o. B Rama Rao.
2. Smt. G RAMA DEVI W/o. Late P. Narasimha Rao.
3. Smt. A RADHIKA W/o. A Ravi Vardhan Reddy.
4. Smt. G CHAITANYA W/o. GVS Ramaiah Naidu.
5. Smt. G UMA RANI W/o. S Sri Sridhar.
6. Smt. Y SAROJA W/o. Y Aditya.

Carrying on business of development of land, real estate and construction at Flat No. 401, Prasanna Sai Enclave, H.No. 11-3-366/1&2, Srinivas Nagar, Secunderabad, Telangana – 500 061, under the firm name of **M/s. MANI DWEEPAM VENTURES,** has been dissolved by mutual consent as from the 22nd day of November, 2024.

**Date : 28-11-2024**

తెలంగాణ ప్రభుత్వం
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
డివిజన్-14, GHMC

నిట్ నెం: **40/E.E.14/GHMC/2024-25** తేది: **27.11.2024**
పనిపేరు : GHMC, KZ డివిజన్-14 క్రింద వివిధ పని. అంచనా మొత్తం/ECV (రూ.లక్షల్లో) : 217.1. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం : 02.12.2024 ఉ.11.00గం. 09.12.2024 ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, GHMC, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్: www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, GHMC.
DIPR.NO.7217-PP/CL/ADVT/1/2024-25 తేది: 28.11.2024

**IN THE COURT OF THE HON'BLE II ADDL, SENIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT:: AT: L.B. NAGAR**
**O. S. NO. 566 OF 2024**

BETWEEN:
**Reddy Rammohan Reddy and 2 others ...PLAINTIFFS**
AND
**1. The Deputy Commissioner,** GHMC, L.B. Nagar Circle-3, Saroor nagar, Ranga Reddy District
**2. All concerned ...DEFENDANTS**

To
**1. The Deputy Commissioner,** GHMC, L.B. Nagar Circle-3, Saroor nagar, Ranga Reddy District.
**2. All concerned ...DEFENDANTS**

**NOTICE**

Please take notice that the above named plaintiffs herein filed the above O.S. against you for declaration to declare them as Legal Heirs of Late R. Vijaysimha Reddy with regard to suit schedule property and with a direction to defendant No.I to mutate the names of plaintiffs in the municipal records in the place of Late R. Vijaysimha Reddy and the said case is posted to **11-12-2024.** The Hon'ble Court hereby called upon the all concerned (Defendant No.2) that any person is interested in the above matter to appear on **11-12-2024 at 10-30 A.M.,** either in person or through an Advocate. Otherwise the matter will be heard and decided ex-parte on merits in accordance with law by the Hon'ble Court.

(BY THE ORDER OF THE COURT)
**Sd/- E. SRINIVASULU, B.COM., LL.B.**
**K. JAIHIND REDDY**
**ADVOCATES**
H.No.8-12-96/BN/11, Sri Balaji Colony, TKR Engineering College Road, Karmanghat, Hyderabad-500 097.
**MOBILE: 9848820339**

**PUBLIC NOTICE**

This is to inform the general public that my client, **Smt. Ch. Indira, wife of Ch. Gopi Kishan Rao,** residing at Plot No. 29 & 31, GK's Classic Apartment, Defence Colony, Sainikpuri, Secunderabad - 500094, is the lawful owner and peaceful possessor of Plot No. 178, Survey No. 747, Nadergul Village, Badangpet Mandal, Saroornagar District, Hyderabad, Telangana.
Smt. Indira inherited the property through a Gift Deed from her husband vide Doc. No. 6627, dated 7th June 2024 registered at SRO Champapet, Hyderabad. Previously, on 14th September 2023, her husband lost the original title deed Doc. No. 356/1990 registered in the name of Late Kum. A. Vilasavathy Devi. A police complaint was filed at Karkhana Police Station, and an FIR was registered No. 15201105242 021413452, dated 11th May 2024. The property was initially acquired by Mr. Gopi Kishan Rao through a Will-Deed dated 14th June 1991 from his maternal aunt, which came into effect upon her demise on 1st February 1993. Smt. Indira now intends to sell the property and has entered into a sale agreement with Mr. A. Kamesh, son of Late A. Adisheshu, on **29th October 2024.**
Anyone finds the lost Sale Deed is requested to return it by contacting the undersigned. Any unauthorized transactions will invite legal action under applicable laws.

**Sd/- Kishore Tirumala**
**Advocate**
4-1-216/30 Street No.7, Karthikeya Nagar, B/H Police Quarters Nacharam, 500076
**Mobile No. 9963900009**
**Kamesh Agreement Holder**
**M.No.9502769429**

**IN THE COURT OF THE HON'BLE MACT - CUM - XXVI ADDL. CHIEF JUDGE: CITY CIVIL COURT: AT: HYDERABAD**
**O.P.No. 1717 OF 2023**

Between:
**Vasthrala Sai Kumar & another ... Petitioners**
And
**Smt. Shameem Sultana & others ...Respondents**

To
**R1) Smt.Shameem Sultana,** W/o. Sri. MD. Giasuddin, R/o. 18-8, Salarjung Colony, Chandrayangutta, Bandlaguda, Falaknuma, Hyderabad-500 008.

**NOTICE**

Please take notice that the above named petitioner is filed the above O.P for grant of compensation against you and other Respondents, under Motor Vehicle Act and the case is posted to **24-12-2024** for your appearance. Therefore you are hereby informed to be present on **24-12-2024 at 10:30 a.m.,** before the above said Court in person or though advocate failing which the matter will be decided as ex-parte.

(By order of the Court)
**K. Shiva Krishna**
**Advocate**
# 3-4-45, Sree Kandakatla Nilayam, Rajendra Nagar, Ramanthapur, Hyderabad-013.

## మహత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు ఎనలేనివి : వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్



**మలక్ పేట ,నవంబర్ 28, ప్రభాతవార్త :** మహత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలు ఎనలేనివని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మహత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత క్రీడలలో రాణించాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



క్రికెట్ బాక్స్ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. నవంబర్ 28.ప్రభాతవార్త :** యువత క్రీడలలో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీలో నూతనంగా నిర్మించిన పవర్ ప్లే క్రికెట్ బాక్స్ గ్రౌండ్ ను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కార్పొరేటర్ లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర రెడ్డి ల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి కల్పన ద్వారా ఆర్థికంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బి.ఆర్.ఎస్. అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి,నాయకులు కుంట్లరు వెంకటేష్ గౌడ్,అనిల్ చౌదరి, ముద్దగౌని సతీష్ గౌడ్,మునగాల రాఘవేంద్రరావు, గౌరిశెట్టి మనోజ్ కుమార్,రాంబాబు, నిర్వాహకులు ప్రసన్న కుమార్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల అభ్యున్నతి కోసం నిరంతర కృషి : కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన సివి అనిల్ కుమార్ గుండె సబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. అనంతరం కార్పొరేటర్‌ను కలిసి తన ఆర్థిక పరిస్థితిని వివరించి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరడంతో, కార్పొరేటర్ వెంటనే స్పందించి అనిల్‌చేత దరఖాస్తు చేయించారు. ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం అనిల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిటవరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.వి.రాంచందర్ రావు,నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, పలుసం శ్రీధర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కోట్ల శ్రీనివాస్‌కు లయన్స్‌క్లబ్ సభ్యుల సన్మానం



కోట్ల శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

**సైదాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కోట్ల శ్రీనివాస్‌కు గురువారం హైద్రాబాద్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.కోటేశ్వర రావు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ యాదయ్య గౌడ్, చైర్‌పర్సన్ వి.భరత్ రాజ్, క్యాబినెట్ మెంబర్ కోట్ల రామ్మోహన్, దుర్గాప్రసాద్‌లు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

### ఘనంగా జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు



జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూళనతో పాటు మహిళోద్ధరణ కోసం జ్యోతిరావుపూలే చేసిన కృషి ఎనలేనిదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి అన్నారు. జ్యోతిరావుపూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని హయత్‌నగర్ మండల కేంద్రంలో గురువారం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడిన జ్యోతిరావుపూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు శ్రీదేవి, అరుణ్‌కుమార్‌గౌడ్, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, రమావత్ సక్రునాయక్, కర్నెసుజాత, కొప్పుల సరిత, కొండాపురం అరుణ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట ,నవంబర్ 28, ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గానికి చెందిన విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నూతన అభివృద్ధి పనులను చేపట్టడానికి ప్రతిపాదనలను రూపొందించాలని సూచించారు. విద్యుత్ సరఫరా లో సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాలలో నూతన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి, ఏడిఈ లు వినోద్ రెడ్డి, శోభన్ బాబు, కార్పొరేటర్లు సలాం షాహిద్ ,మినాజుద్దీన్, నాయకులు అబ్రార్, సైఫుద్దీన్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

## డ్వాక్రా మహిళల అభ్యున్నతికి కృషి : మంగమ్మ శివకుమార్

**తుర్కయంజాల్ నవంబర్ 28 (ప్రభాతవార్త)** తుర్కయంజాల్ మున్సిపాలిటీ డ్వాక్రా మహిళల అభ్యున్నతికి బాధ్యతగా కృషి చేయడమే ధ్యేయమని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కౌన్సిలర్ కొత్త కురుమ మంగమ్మ శివకుమార్ అన్నారు. అదేవిధంగాతుర్కయంజాల్ మున్సిపాలిటీ 21వ వార్డులో శ్రీరామ నగర్ కాలనీ లో నూతన డ్వాక్రా భవనం ఓపెనింగ్ చేయడానికి ముఖ్య అతిథిగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్ డ్వాక్రా మహిళల అభ్యున్నతికి బాధ్యతగా కృషి చేయడమే ధ్యేయమని అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో డ్వాక్రా నూతన భవనాన్ని ఓపెనింగ్ చేసినారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించేలా అనేక పథకాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలను పొంది స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పి అంచలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని, ప్రభుత్వ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ బ్లాక్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మల్లిక మరియు డ్వాక్రా పొదుపు సంఘం మహిళలు మరియు కాలనీవాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు



## రీ డిప్లాయ్డ్ విఆర్‌ఓల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రీ డిప్లాయ్డ్ విఆర్‌ఓలు

**సైదాబాద్, నవంబరు 28 ప్రభాతవార్త:** రీ డిప్లాయ్డ్ విఆర్‌ఓలు సర్వీస్ పరంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇతర శాఖల్లోని పాత సీనియార్టీ లెక్కించకపోవడం, చాలా శాఖల్లో అసలు సీనియార్టీ లిస్టులలో విఆర్‌ఓల పేర్లు చేర్చకపోవడం, ఇతర శాఖల్లో డిపార్ట్‌మెంటు టెస్టులు పాసయి ప్రమోషన్స్‌కు అర్హత ఉన్నప్పటికీ పదోన్నతులు ఇవ్వక పోవడం వల్ల సర్వీస్ పరంగా నష్టపోతున్న విషయాన్ని వారు కలెక్టర్‌కు వివరించారు. ఇతర శాఖల్లో స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెట్లు మంజూరు చేయకపోవడం తదితర సమస్యలను వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాగా తమ వినతికి కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని చెప్పినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీ డిప్లాయ్డ్ విఆర్‌ఓల నాయకులు రాఘవేందర్ రావు, ముత్యాలు, శ్రీనివాస్, దయానంద్, వెంకటేష్, అజీజ్, మన్నెయ్య, రఘుపతి రెడ్డి, శైలజ, భార్గవి, కవిత, శ్రావణి, భాగ్యలక్ష్మి, శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో పార్కులో అపరిశుభ్రత : కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం. నవంబర్.28.ప్రభాతవార్త.** బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎస్కేవోస్ కాలనీ స్వామి వివేకానంద పార్కులో గత కొద్ది కాలంగా పేరుకుపోయిన చెత్త మరియు చెట్ల కొమ్మలను తొలగించాలని పలుమార్లు చెప్పిన పార్కు పరిశుభ్రతను పట్టించుకునేందుకు ఏ ఒక్క అధికారి కూడా పార్క్ వద్దకు రారని వాకర్స్ సభ్యులు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డికి సమాచారం ఇవ్వడంతో.స్వామి వివేకానంద పార్కును పర్యవేక్షించడం జరిగింది.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పార్కుల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఏ పార్కు చూసినా చెత్తాచెదారాలు మరియు చెట్ల కొమ్మలతో అస్తవ్యస్తంగా తయారు చేస్తున్నారని ఒక్క రోజు కూడా పార్కులకు హార్టికల్చర్ డిపార్ట్మెంట్ అధికారులు సందరించారని మరియు డివిజన్ పరిధిలోని ప్రతి పార్కు పరిస్థితి ఇలాగే ఉందని కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, మరియు పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా సెక్రటరీ పవన్ రెడ్డి, నాయకులు ఠాగూర్ మరియు తదితరులు పాల్గొన్నారు.



## డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించండి : బన్నాల గీత

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ గురువారం గ్రేటర్ కమిషనర్ ఇలంబర్తిని కోరారు. ఈ మేరకు గురువారం జిహెచ్ఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇలంబర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సర్వే ఆప్ ఇండియా నుంచి రోడ్డు క్రాసింగ్ చాలా ఇబ్బందికరంగా మారిందని, సిగ్నల్ పాయింట్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. చిలుకానగర్ చౌరస్తా నుంచి కావేనగర్ కల్వర్టు వరకు ఎస్ఎన్‌డిపి ద్వారా నిధులు కేటాయించి ట్రంక్ లైన్ నిర్మించాలని విన్నవించారు. డివిజన్‌లో అధిక శాతం మంది పేదలు నివసిస్తున్నారని, డివిజన్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మించాలని కోరారు. ఉప్పల్ బ్యాంక్ కాలనీ ఆటో స్టాండ్ నుంచి రాఘవేంద్రనగర్ కాలనీ కల్వర్టు వరకు 60 అడుగుల కొత్త సిసి రోడ్డు నిర్మించాలని విన్నవించారు. దీనిపై కమిషనర్ ఇలంబర్తి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

# మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే

**వనస్థలిపురం. నవంబర్. 28.ప్రభాతవార్త.** మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే అని టి పి సి సి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త గారు అన్నారు.అందరికీ విద్యను అందించేలా కృషిచేసిన మహనీయుడు, తత్వవేత్త, సంఘ సంస్కర్తమహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా లో జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సంద ర్భంగా ఆయన మాట్లాడుతూసమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే. సామాజిక ఉద్యమాల మార్గ దర్శి మహాత్మా జ్యోతిరావు పూలే చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీ యుడు జ్యోతి రావు పూలే. విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు, బల హీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పో రాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గ రపు దయానంద్ గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కిడి ప్రభాకర్, ఎస్సీ సెల్ చైర్మెన్ జోగి గారు, మహేందర్, బిక్షపతి, సైదు లు, మహేష్, శివ కుమార్, సాయి, ప్రభాకర్, భాస్కర్ యా దవ్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జలమండలి అధికారులపై జీఎంకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్



జలమండలి జీఎంను కలిసిన కార్పొరేటర్, కాలనీవాసులు

**హయత్‌నగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రకాలనీలో 5-6 నెలలుగా త్రాగునీరు సరిగా రావడం లేదని సమాచారం ఇచ్చినా జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో తాగు నీటి సమస్య ఉందని చెప్పినా పట్టించుకోకపోవడం ఏమిటన్నారు. అధికారుల తీరును నిరసిస్తూ కాలనీవాసులతో కలిసి ఆయన గురువారం జలమండలి జనరల్ మేనేజరు శ్రీనివాస్‌రెడ్డిని కలిసారు. ఇకనైనా స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించేలా అధికారులకు సూచనలివ్వాలని కోరారు. జలమండి జీఎంను కలిసిన వారిలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చిన్న, లింగారెడ్డి, హరినాథ్‌బాబు, నరహరి, జనార్ధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నాం : చైర్‌పర్సన్ జయశ్రీరాజు



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ

**హయత్‌నగర్, నవంబరు 28 ప్రభాతవార్త:** అన్ని వార్డులలోని కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలను కల్పించి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తామని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. 8వ వార్డులో పెద్దఅంబర్‌పేట నుంచి మునుగనూర్ వెళ్లేదారిలోని హైమావతి కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె గురువారం ప్రారంభించి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయిస్తూ అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నామని వివరించారు. కాంట్రాక్టర్లు పనులలో నాణ్యతను పాటించాలని లెవెల్స్‌ను సరిచూసుకుని పైప్‌లైన్ పూర్తిచేయాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు అనంతరం భవిష్యత్తులో తిరిగి ఇబ్బందులు రాకుండా పనులు చేయాలన్నారు. తమ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించడంపై సంతోషాన్ని వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్‌ను సన్మానించారు.

### జ్యోతిరావుపూలే ఆశయసాధనకు కృషి : బండారు శ్రీవాణి



రామంతాపూర్‌లో మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ పెద్ద చెరువు కట్టపై ఉన్న మహాత్మజ్యోతిరావుపూలే విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహాత్మజ్యోతిరావుపూలే బాలికల కోసం మొదట పాఠశాల ప్రారంభించారని, వితంతువుల కోసం ప్రత్యేక గృహాన్ని స్థాపించారని పేర్కొన్నారు. విద్య యొక్క విశ్వకరణకు సమర్థించిన మొదటి సంస్కర్త అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, సీనియర్ నేతలు ముత్తినేని జగదీష్, రేవు నరసింహా, ఉలుగొండ నారాయణదాసు, తాళ్ల మంగ, వీణ, కందకట్ల దయానందరెడ్డి, వేముల తిరుపతయ్య, శీలం సోమశేఖర్, కామేశ్వర్‌రావు, తుమ్మల రవి,దర్శనాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జునస్వామి ఆలయం భూముల పరిరక్షణకు చర్యలు



శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న చైర్మన్ నామ్ రాజిరెడ్డి తదితరులు

**రామంతాపూర్, నవంబరు 28 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం పాలక మండలి సమావేశం గురవారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి నరేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయం చైర్మన్ నామ్ రాజిరెడ్డి, ఇ.సతీష్‌గౌడ్, బొడ్డు బాలయ్య, ముత్యాల జంగయ్య, మొగిలి లింగం, ఎం.శోభ, ఆలయ పూజారి మోత్కూరి శేఖర్ బాబుశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆలయం పునః నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయ భూములను కాపాడి వాటిని పరిరక్షిస్తామని తెలిపారు. ఆలయం వెనుక నిర్మిస్తున్న కల్యాణ మండపం పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. ఆలయం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు పాల్గొన్నారు.

## సమాజానికి తమ వంతు సేవలు : జగిని శ్రీనివాస్



దివ్యాంగ జంటకు వివాహాన్ని జరిపిస్తున్న జగిని శ్రీనివాస్, నాగమల్ల అనిల్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,నవంబరు 28, ప్రభాతవార్త:** సమాజానికి తమ వంతు సేవలు అందిస్తామని ప్రముఖ సంఘ సేవకులు, జగిని ఫర్నిచర్స్ అధినేత జగిని శ్రీనివాస్ పేర్కొన్నారు. దివ్యాంగ జంట పెళ్లిని జగిని ఫర్నిచర్స్ అధినేత జగిని శ్రీనివాస్ గుప్తా, రూపాయి ఫౌండేషన్ చైర్మన్ నాగమల్ల అనిల్ కుమార్, యడవెల్లి బాలరాజు, రామ్ సేవా సమితి చైర్మన్ నర్సింహారావులు అంగరంగ వైభవంగా ఉచిత వివాహం కార్యక్రమాన్ని జరిపించారు. మలక్ పేటలోని శ్రీనివాస కమ్యూనిటీ హాల్ లో బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా మోనిక,రాజేష్ ల వివాహాన్ని కన్నుల పండువగా జరిపించారు. నూతన దంపతులకు పుస్తె, మట్టెలు, పెళ్లి బట్టలను అందజేసి విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగిని శ్రీనివాస్ మాట్లాడుతూ నిరుపేదలైన రాజేష్ మోనికలు వారి పెళ్లి నిమిత్తం మమ్ములను సంప్రదించడం జరిగిందని, వారికి మేము అండగా ఉంటామని ధైర్యం చెప్పి వారికి ఎలాంటి లోటు లేకుండా ఉచిత వివాహం జరిపించామని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా గతంలో కూడా ఇలాంటి ఉచిత వివాహలు ఎన్నో జరిపించామని అన్నారు. నిరుపేదలు, దివ్యంగులు వారి వివాహం కోసం మమ్ములను సంప్రదిస్తే, వారికి అన్ని విధాలుగా అండగా వుంటూ వారి వివాహాన్ని జరిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



**మల్కాజిగిరి నవంబరు 28 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి సహాయనిది ద్వారా వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సి. ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల ఎల్.ఓ.సి పత్రాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అందజేశారు .ఈ కార్యక్రమంలో రావుల అంజయ్య, అమీనుద్దిన్, ఉస్మాన్, సంతోష్ నాయుడు, సాయి గౌడ్, ఇబ్రహీం, సాయి కిరణ్, తదితరులు ఉన్నారు

### ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** ఉప్పల్ 11 కెవి ఎన్‌జిఆర్ఐ పీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ ఎం.నిఖిల్ తెలిపారు. కల్యాణపురి పీడర్ పరిధిలోని కల్యాణపురి, జాహిద్‌నగర్, బ్యాంక్‌కాలనీ, ఇందిరానగర్, అంబేద్కర్‌నగర్, సీతారామకాలనీ, ఈస్ట్, నార్త్ కల్యాణపురి, బాలాజీ ఎన్‌క్లేవ్, రాఘవేంద్రకాలనీ, టీచర్స్‌కాలనీ, అజ్మత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించాలని కోరారు.

## చిలుకానగర్‌లో ఘనంగా జ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు



చిలుకానగర్‌లో మహాత్మజ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 28 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లో మహాత్మజ్యోతిరావుపూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలుకానగర్ చౌరస్తాలో గురువారం జరిగిన పూలే వర్ధంతి వేడుకలకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి మహాత్మజ్యోతిరావుపూలే చేసిన సేవలు అభినందనీయమన్నారు. బిసి కులగణన చేపట్టిన వెనుబడిన వర్గాలకు చేయూత అందించారని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, బజారు జగన్‌గౌడ్, లుకాస్, ఆకిటి ఆగంరెడ్డి, కొంపల్లి బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు ముల్కపల్లి రాజేష్, శ్రీకాంత్‌గౌడ్, నల్లబెల్లి మహేందర్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, అమర్, సత్యం, బొట్టు రాజేష్, నవీన్ యాదవ్, కుమార్, గండికోట గణేష్, శంకర్, జగదీష్, వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, గీత, విజయ, ప్రేమలత, సమత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని విషం సేవించి ఇద్దరు వ్యక్తులు మృతి

**మలక్ పేట ,నవంబర్ 28, ప్రభాతవార్త:** గుర్తు తెలియని విషం సేవించి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మలక్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సురేష్ కథనం ప్రకారం అంబర్ పేట కు చెందిన వెంకటేష్ (35), మూసారాంభాగ్ కు చెందిన నరేందర్ (45) లు సలీంనగర్ పార్కులో గురువారం సాయంత్రం గుర్తుతెలియని విషం సేవించి పడి ఉండడంతో స్థానికులు గమనించి మలక్ పేట పోలీసులకు సమాచారం అందజేసారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం ఉస్మానియా మార్చారికి తరలించారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.